క్లుప్తంగా

వీడీసీ కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గం

కడెం: మండలంలోని మాసాయిపేట్ గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ)ని ఆదివారం గ్రామంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో ఎన్నుకున్నారు. వీడీసీ అధ్యక్షుడిగా రత్నాల రాజేశ్, ప్రధాన కార్యదర్శిగా బుర్ర రమేశ్ గౌడ్, క్యాషియర్‌గా సంగం చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా తిరుపతి, రాజేశ్వర్, సలహాదారుగా రాజేశ్, తదితరులు సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇందులో గ్రామస్తులు తదితరులున్నారు.

కవి బాలాజీకి అవార్డు



అవార్డు అందుకుంటున్న బాలాజీ

భైంసారూరల్: మండలంలోని ఇలేగాం గ్రామానికి చెందిన కవి, రచయిత, మోటివేషన్ స్పీకర్ డాక్టర్ రెడ్ల బాలాజీ అవార్డు అందుకున్నారు. ఆదివారం కరీంనగర్‌లోని ఫిలింభవన్‌లో శ్రీఆర్యాణి సకలకళా వేదిక, గౌతమేశ్వర సాహితీ కళా సేవా సంస్థ సంయుక్తంగా ఈ అవార్డు అందజేశారు. కవి డాక్టర్ దూడపాక శ్రీధర్, పలువురు కవులు జాతీయస్థాయి భారత విభూషణ్‌తోపాటు బంగారు నంది గోల్డ్ మెడల్‌ను బాలాజీకి అందించారు. బాలాజీకి భువనేశ్వరి, దేవిప్రియ, వర్ష, వినాయక్‌ప్రసాద్, బాజీరావు, వినాయక్, చక్రధర్, నరేశ్, విజయ్‌కుమార్ తదితరులు అభినందనలు తెలిపారు.

బాసరవాసికి సన్మానం



రమేశ్‌ను సన్మానిస్తున్న నాయకులు

బాసర: తమిళనాడు రాష్ట్రంలోని తీర్వన్నామలై జిల్లా చేయర్ తాలూకాలో ఆదివారం నిర్వహించిన అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ కార్యవర్గ సమావేశంలో బాసరకు చెందిన జంగం రమేశ్‌ను సన్మానించారు. రమేష్ గురుస్వామి జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎంపికై అందిస్తున్న సేవలకు సన్మానించారు. నాయకులు ఉన్నారు.

మేదరుల అభివృద్ధికి కృషి



సత్యనారాయణను సన్మానిస్తున్న కులస్తులు

కడెం: మేదరుల సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ అన్నారు. ఇటీవలే రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనను ఆదివారం కడెంలో మేదరి సంఘం ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఆ సంఘ నాయకులు బొమ్మిడి మహేశ్వర్, లక్ష్మినర్సయ్య, నర్సయ్య, రాజేందర్, శ్రీకాంత్, రాజు తదితరులున్నారు.

వానమ్మా.. కరుణించమ్మా



జలాలను తీసుకొస్తున్న గ్రామస్తులు

బాసర: వర్షాలు కురిసి పంటలు పండాలని మండలంలోని మైలాపూర్‌లో రైతులు ఆదివారం గ్రామ దేవతలకు గోదావరి జలాలతో అభిషేకం నిర్వహించారు. రైతులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

పల్లెకు చేరిన టెక్నాలజీ



తానూరు: వ్యవసాయంలోనూ ట్రెండ్ మారుతోంది. గతంలో రైతులు డబ్బాలు భుజాన వేసుకుని పంట మొక్కలపై క్రిమిసంహార మందు పిచికారీ చేసేవారు. ప్రస్తుతం డ్రోన్ పరికరం సాయంతో పంటలపై మందు స్ప్రే చేస్తున్నారు. ఒడ్డున ఉండి రిమోట్ సాయంతో ఆపరేట్ చేస్తున్నారు. ఆదివారం మండలంలోని దాగాం శివారులో ఓ రైతు చేనులో డ్రోన్‌తో పురుగు నివారణ మందు పిచికారీ చేయించాడు. ఎకరాకు రూ.400 తీసుకుంటున్నామని నిర్వాహకుడు పేర్కొనగా.. సమయం ఆదా అవుతుందని రైతు గంగాధర్ తెలిపారు.

శిథిలావస్థకు భవనాలు

- కూలేలా తహసీల్దార్ కార్యాలయాలు
- ఇప్పటికే పెచ్చులూడుతున్న పైకప్పులు
- భయంతోనే సిబ్బంది విధులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



కూలిన నిర్మల్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయ భవనం (ఫైల్)



శిథిలావస్థకు ఖానాపూర్ తహసీల్దార్ కార్యాలయ భవనం

ఖానాపూర్: జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్నిచోట్ల నిజాం కాలంలో ఏర్పాటు చేసిన భవనాల్లోనే ఇప్పటికీ కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. జిల్లాలో 19 మండలాలుండగా అందులో 13పాతవి కాగా కొత్తవి ఆరు. పాలనా సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన కొత్త మండలాల్లో నేటికీ తహసీల్దార్ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించలేదు. ప్రస్తుతం ఇతర శాఖల కార్యాలయాల భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. పాత మండలకేంద్రాల్లోనూ అన్ని వందల ఏళ్ల నాటి భవనాల్లోనే తహసీల్దార్ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. ఎప్పుడు ఏయే ప్రమాదం జరుగుతుందోనని కార్యాలయాలకు వచ్చే ప్రజలు, విధులు నిర్వర్తించే సిబ్బంది బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. వర్షాకాలంలో వీరి కష్టాలు వర్ణనాతీతం. గతేడాది జిల్లాకేంద్రంలోని నిర్మల్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయ భవన పైకప్పు కూలింది. అక్కడే ఉన్న పలువురికి పెనుప్రమాదం తప్పింది. ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి నూతన భవనాలు నిర్మించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

రెవెన్యూశాఖనే కీలకం..

ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే కీలకశాఖల్లో రెవెన్యూశాఖ ప్రధానమైంది. భూమి రిజిస్ట్రేషన్లతోపాటు భూసమస్యలు పరిష్కరించుకునేందుకు తహసీల్దార్ కార్యాలయాలకు నిత్యం జనం భారీగా తరలివస్తుంటారు. ప్రభుత్వ భూములతోపాటు పలు కీలక డాక్యుమెంట్లను తహసీల్దార్ కార్యాలయాల్లోనే భద్రపరుస్తుంటారు. శిథిలావస్థకు చేరిన తహసీల్దార్ కార్యాలయ భవనాల్లో గదులు వర్షానికి ఊరుస్తుండటంతో పత్రాలు తడిసిపోతున్నాయి. 2022 ఆగష్టు26న నిర్మల్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో గూడ కూలింది. నిర్మల్‌రూరల్ తహసీల్దార్ కార్యాలయ భవనం సైతం శిథిలావస్థకు చేరడంతో రూరల్, అర్బన్ తహసీల్దార్ కార్యాలయాలను పాత కలెక్టరేట్‌లోని ఆర్డీవో కార్యా లయంలో ఏర్పాటు చేశారు.

ఖానాపూర్‌లో పరిస్థితి..

నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్‌లో తహసీల్దార్ కార్యాలయ భవనం కూలేందుకు సిద్ధంగా ఉంది. గతంలో పైకప్పు కూలి పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఏటా వర్షాకాలంలో కార్యాలయానికి వచ్చేవారితోపాటు సిబ్బంది భయంతో వణికిపోతున్నారు. ఇటీవల ఖానాపూర్‌లో జరిగిన భూభారతి రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ కార్యాలయానికి సొంత భవనం మంజూరు చేయాలని ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్.. మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూశాఖ మంత్రితో మట్లాడి నూతన భవనానికి నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కోటా నుంచి రూ.40 లక్షలు భవన నిర్మాణానికి మంజూరు చేస్తానని ఎమ్మెల్యే బొజ్జు ఇటీవల ప్రకటించారు.



దస్తురాబాద్‌లో బీసీ హాస్టల్ భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

నూతన భవనాలు నిర్మించాలి



జిల్లాలో తహసీల్దార్ కార్యాలయాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఉన్నతాధికారులు భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలి. కార్యాలయాలకు వచ్చే వారికి కూర్చొనేందుకు చోటు లేక చెట్ల కింద, రోడ్లపై వేచి చూస్తున్నారు.

– సునారికారి రాజేశ్, సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసీ) ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి

పెద్దప్రమాదం తప్పింది



గతంలో ఖానాపూర్‌లోని తహసీల్దార్ భవనానికి పని నిమిత్తం వెళ్లగా నా పక్కనే పైకప్పు కూలింది. పక్కకు తప్పుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇప్పటికీ కార్యాలయంలో మరమ్మతులు చేపట్టడం లేదు. ప్రజలు, సిబ్బంది భయపడుతున్నారు.

– సత్యమూర్తి, ఖానాపూర్

ప్రతిపాదనలు పంపాం



ఖానాపూర్ తహసీల్దార్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో సమస్య తీవ్రంగా ఉంది. కొత్తది నిర్మించాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదించాం. నూతన భవనం మంజూరు చేస్తానని ఇటీవల ఎమ్మెల్యే బొజ్జు సైతం హామీ ఇచ్చారు.

– సుజాత, తహసీల్దార్, ఖానాపూర్

వైభవంగా బోనాల పండుగ



బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే రామారావు పటేల్



ఖానాపూర్: సింగాపూర్ పెద్దమ్మతల్లి ఆలయంలో..

భైంసాటౌన్: ఆషాఢమాసం చివరి ఆదివారం సందర్భంగా పట్టణంలో బోనాల పండుగ కనుల పండువగా నిర్వహించారు. స్థానిక గట్టు మైసమ్మ ఆలయానికి భక్తులు తరలివచ్చారు. ఎమ్మెల్యే రామారావు పటేల్‌తోపాటు పలువురు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే బోనమెత్తుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు, ఆలయ నిర్వాహకులు, హిందూ ఉత్సవ సమితి సభ్యులు ఉన్నారు.

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్ పెద్దమ్మ తల్లి ఆలయానికి భక్తులు తరలివచ్చారు. రెండో అడెల్లిగా పేరొందిన అమ్మవారికి తలనీలాలు, బెల్లం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

గండి పోచమ్మ ఆలయంలో సందడి

కడెం: మండలంలోని ఉడుంపూర్ సమీపంలోని గండి పోచమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. ఆదివారం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పాడి పంటలు సల్లంగా ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు.

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని ద్రోణ ఉన్నత పాఠశాలలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. విద్యార్థులు అమ్మవారి వేషధారణ, పోతరాజుల విన్యాసాల్లో ఆకట్టుకున్నారు. కరస్పాండెంట్ సురేశ్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, ఉపాధ్యాయులు ముత్యం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి ఆలయంలో..

తానూరు: మండలకేంద్రంలోని డాంగ్‌పల్లి పెద్దమ్మ తల్లి ఆలయంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పూజలు నిర్వహించారు. పెద్దమ్మతల్లి విగ్రహానికి అభిషేకం చేసి నైవేద్యం సమర్పించారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ కమిటీ సభ్యులు సాయిబాబు, రాజు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



తానూరు : పూజలు చేస్తున్న భక్తులు



లక్ష్మణచాందలో బోనాలతో విద్యార్థులు

ఆటో యూనియన్ సభ్యుల పూజలు

కుంటాల: ప్రమాదాలు జరగకుండా సురక్షిత ప్రయాణం సాగాలని కోరుతూ మండలంలోని వెంకూర్ పెద్దమ్మతల్లి ఆలయంలో ఆదివారం ఆటో యూనియన్ సభ్యులు పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. ఆటో యూనియన్ మండల కన్వీనర్ ఎల్లమ్మల గజేందర్, బొంతల సంజీవ్, చరణ్, ప్రశాంత్, బాబు, దశరథ్, రవి, చిన్నయ్య, భీమన్న, నాగేశ్, రాజు, శివయ్య పాల్గొన్నారు.

'నిర్మల్ ఎమ్మెల్యేను సస్పెండ్ చేయాలి'



సారంగపూర్‌లో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు



లక్ష్మణచాందలో..

సారంగపూర్: మహిళాశక్తి సంబురాల్లో భాగంగా రాష్ట్రీయ గీతం ఆలాపన సమయంలో కుర్చీలోంచి లేవకుండా తెలంగాణ ప్రజలను అవమానపరిచేలా వ్యవహరించిన నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని బీజేపీ నుంచి సస్పెండ్ చేయాలని సారంగపూర్ ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ డిమాండ్ చేశారు. ఆదివారం మండలకేంద్రంలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బొల్లోజి నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్, విలాస్‌రావు, రాజ్‌మహ్మద్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు మారుతి, లక్ష్మణ్, ఏఎంసీ డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

లక్ష్మణచాంద: సీఎం రేవంత్‌రెడ్డిని అగౌరవపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో ఆదివారం నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, కొండ్ర నరేశ్‌రెడ్డి మాట్లాడారు. మహిళాశక్తి సంబురాల్లో రాష్ట్రీయ గీతాన్ని మహేశ్వర్‌రెడ్డి అగౌరవపరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఒడ్నాల రాజేశ్వర్, నరేశ్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, బాపట్ల ఆశన్న, సమ్మెట రవి, కిరణ్, గంగాధర్‌గౌడ్ నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



లోకేశ్వరం : చెక్కు అందిస్తున్న విఠల్‌రెడ్డి

లోకేశ్వరం: మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామానికి చెందిన రాజేందర్‌కు రూ.48వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆదివారం భైంసా మండలం దేగాం గ్రామంలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి లబ్ధిదారుకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాలం గంగాధర్ ఉన్నారు.

భైంసారూరల్: భైంసా పట్టణానికి చెందిన చొప్పరి గంగాధర్‌కు రూ.44 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆదివారం మండలంలోని దేగాం గ్రామంలోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి బాధితుడికి సీఎం సహాయ నిధి చెక్కు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉత్తం బాలేరావు, సాయినాథ్, సుంకెట శ్రీనివాస్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

పురస్కారం అందజేత

తానూరు: మండలంలోని ఖర్బాలా గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్ మంగ్నాల్కర్ సంజయ్ కరీంనగర్‌లోని ఫిలింభవన్‌లో ఆదివారం భారత్ విభూషణ్ పురస్కారం అందుకున్నారు. సామాజిక సేవలకు గుర్తింపుగా శ్రీతిర్యాణి సకల కళావేదిక, గౌతమేశ్వర సాహిత్య కళావేదిక సేవాసంస్థల ఆధ్వర్యంలో అవార్డు అందుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న భక్తులు

బాసర: మండలకేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో ఆదివారం తెల్లవారుజామున గ్రామదేవతలైన మారెమ్మ, పోత లింగయ్య, పోచమ్మ విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వీధుల గుండా విగ్రహాల శోభాయాత్ర చేపట్టగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. పంతులు మురళి సమక్షంలో వేడుక నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ అభివృద్ధిలో పలువురు దాతలు భాగస్వాములయ్యారు. మందిరంలో మారెమ్మ దేవత విగ్రహాన్ని గ్రామానికే చెందిన దంపతులు ఉమ్మాయి భాగ్యలక్ష్మి-సంజీవ్‌రావు, పోతరాజు ప్రతిమను గిరిమన్నగారి. గంగారావు విరాళంగా అందజేశారు. వీరిని రాజు మాతాంగి ఆలయ కమిటీ, అంబేద్కర్ సంఘం సభ్యులు, కుల సభ్యులు సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదం అందజేశారు.



మారెమ్మ ప్రతిమ

భారతీయ కిసాన్ సంఘ్ మండల కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

తానూరు(ముథోల్): మండలకేంద్రమైన ముథోల్ శ్రీ పశుపతినాథ్ శివాలయం మండపంలో ఆదివారం భారతీయ కిసాన్ సంఘ్ ముథోల్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జంబుల సాయిప్రసాద్, ఉపాధ్యక్షుడిగా బుజిగిరి దిగంబర్, కార్యదర్శిగా బసిండ్ల సాయన్న సహ కార్యదర్శులుగా దేగాం శ్రీధర్‌రెడ్డి, రాథోడ్ సాయినాథ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు విఠల్‌రెడ్డి, కార్యదర్శి కొరిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, సహ కార్యదర్శి మమ్మాయి గంగాధర్, జిల్లా యువ ప్రముఖ్ ఆనంద్ బండారి ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. అనంతరం అష్టా, సరస్వతీ నగర్ గ్రామాల కమిటీలను ఎన్నుకున్నారు. ప్రతీ గ్రామంలో గ్రామ కమిటీని ఏర్పాటు చేసి శిక్షణ తరగతులు నిర్వహించాలని నిర్ణయించారు. ఈసందర్భంగా బాసర, ముథోల్, తానూరు, భైంసా మండలాల్లో నెలకొన్న సాగు నీటి సమస్య గురించి చర్చించారు. కార్యక్రమంలో ముథోల్ గ్రామపెద్దలు, వివిధ గ్రామాల రైతులు, తదితరులు పాల్గొన్నారు.

'గురుకులం' కోసం ఎదురుచూపు

- తొలి విడతలో ముధోల్‌కు దక్కని చోటు
- చదువులమ్మ గుడి బాసరను పట్టించుకోని ప్రభుత్వం
- ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయాలంటున్న నియోజకవర్గ ప్రజలు



బాసర సరస్వతీదేవి ఆలయం

భైంసా: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో మార్పులు తెచ్చి అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్(సమీకృత గురుకులం) ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. సమీకృత గురుకులాల్లో కులమతాలకు అతీతంగా విద్యార్థులంతా ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు ఒకే చోట చదివేలా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. నియోజకవర్గంలో 25 ఎకరాల స్థలంలో రూ.200కోట్లతో నిర్మించే ఈ సమీకృత గురుకులంలో 2,500 మంది నుంచి 3000 వరకు విద్యార్థులు చదువుకునేలా డిజైన్‌ను రూపొందించారు. కానీ తొలి విడతలో ఏర్పాటు చేసే సమీకృత గురుకులాల్లో జిల్లాకు చోటు ఇవ్వలేదు.

ప్రాధాన్యత లేదు...

దేశంలోనే చదువుల తల్లిగా పేరున్న సరస్వతీ క్షేత్రానికి ప్రాధాన్యత ఇవ్వడంలేదు. దేశవ్యాప్తంగా భక్తులంతా తమ పిల్లలను బాసర తీసుకొచ్చి అక్షరాభ్యాసం చేయిస్తారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ అప్పటి ప్రభుత్వాలు విద్యకు సంబంధించిన అన్ని కార్యక్రమాలను బాసర నుంచే శ్రీకారం చుట్టేవారు. అప్పట్లో ఉమ్మడి రాష్ట్రంలో చదువుల పండుగ కార్యక్రమాన్ని బాసర నుంచే ప్రారంభించారు. ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య బాసర అమ్మవారి క్షేత్రం నుంచే పాఠశాలలను, అభ్యాస కేంద్రాలను ప్రారంభించారు. తమ వద్ద చదువుకునేవారిని బాసరకు తీసుకొచ్చి అమ్మవారి ఆలయంలో పూజలు చేశాకే పాఠాల బోధన ప్రారంభించేవారు. ఇప్పటికీ పదో తరగతి, ఇంటర్, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేవారు సరస్వతీ ఆలయంలో పూజలు జరిపిస్తారు. చదువులమ్మ కొలువుదీరిన ముధోల్ నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం కల్పించాలని కోరుతున్నారు.

ఎన్నో ఆశలు..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ తదితర వర్గాల విద్యార్థులు ఒకేచోట చదువుకునేలా కార్పొరేట్‌కు ధీటుగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభిస్తున్నారు. ఇందులో చదివితే తమ పిల్లల భవిష్యత్ బాగుంటుందని తల్లిదండ్రులు పెట్టుకున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పాలకులు, ఉన్నతాధికారులు చొరవ తీసుకొని చదువులమ్మ కొలువుదీరిన ఈ ప్రాంతంలో సమీకృత గురుకులం ఏర్పాటు చేయాలని నియోజకవర్గ ప్రజలు వేడుకుంటున్నారు.

మంత్రిని కలిసి విన్నవిస్తాం



చదువులమ్మ కొలువుదీరిన ముధోల్ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రారంభమయ్యేలా చూస్తాం. రాష్ట్ర ప్రభుత్వం తొలి విడతలో నియోజకవర్గానికి అవకాశం ఇవ్వలేదు. దేశవ్యాప్తంగా ఈ ప్రాంతాన్ని చదువులతల్లి సరస్వతీ అమ్మవారికి నిలయంగా భావించి తమ పిల్లలకు ఇక్కడే అక్షరాభ్యాసాలు చేయిస్తారు. ఇలాంటి చోటుకు ప్రాధాన్యత కల్పించి స్కూల్ ఏర్పాటయ్యేలా సంబంధిత మంత్రిని కలిసి విన్నవిస్తాం.

– పవార్ రామారావు పటేల్, ముధోల్ ఎమ్మెల్యే

వానదేవుడా.. నీ జాడేది ?



కొద్దిరోజులు వర్షాలు కురువకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అప్పులు తెచ్చి పంట సాగు చేస్తే వరుణుడు కరుణించడం లేదని వాపోతున్నారు. మండలంలోని వట్టోలి గ్రామంలో చేనులో కూర్చొని ఓ రైతు ఆకాశం వైపు దీనంగా చూస్తున్న చిత్రమిది. – లోకేశ్వరం